కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గౌతంనగర్: డివిజన్ శ్రీరామాంజనేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా దాసరి సుధాకర్, జనరల్ సెక్రటరీగా బల్లూరి కార్తీక్‌సాగర్, జాయింట్ సెక్రటరీలుగా శివ, సందీప్, కోశాధికారిగా వినోద్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మల్లేష్, కృష్ణ, సాయిరామ్, వేణుగోపాల్, సురేష్‌గౌడ్, రాహుల్‌రెడ్డి, అభిషేక్, మహేష్, కమిటీ సభ్యులుగా యాదగిరి, శ్యామ్‌కుమార్, వెంకటస్వామి, శివ, వెంకటేష్, మంగ ఎన్నికయ్యారు.

'తిరు నక్షత్రం' ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ వేంకటేశ్వర దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి జన్మ నక్షత్రమైన పూర్వాపాల్గుని (తిరు నక్షత్రం) సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, అర్చనాది పూజా కార్యక్రమాలను అర్చకులు తులసీరమణాచార్యులు నిర్వహించారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం



రామంతాపూర్: పద్మశాలి సంక్షేమ సంఘానికి క్రమశిక్షణ కమిటీలు చైర్మన్‌గా ఎన్నికైన యాదగిరి, వైస్ చైర్మన్ రాపోలు రామచంద్రరావు, ఆలయ చైర్మన్ జున్ను వెంకటయ్య, తిరందాసు, శేషయ్య, చిక్కా సత్యనారాయణ, పెంటయ్య, కృష్ణ, రాములు, వెంకటేశం, అంబయ్య తదితరులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వనం యాదగిరి మాట్లాడుతూ.. సంక్షేమ సంఘాన్ని క్రమశిక్షణతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండా కృష్ణమూర్తి, రామ్‌నర్సయ్య, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



డీసీతో కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్

మౌలాలి: మల్కాజ్‌గిరి సర్కిల్‌కు నూతనంగా వచ్చిన డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాను మౌలాలి కార్పొరేటర్ సునీత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేసేలా చూడాలని ఆమె కోరారు. మౌలాలి డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులున్నారు.

అమ్మవారి ఆలయ ముఖద్వారం ప్రారంభం



ఉప్పల్: చిలుకానగర్ బీరప్పగడ్డ నల్లపోచమ్మ ఆలయ ముఖద్వారాన్ని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ హాజరై సోమవారం ప్రారంభించారు. ఎన్నికల హామీల్లో మాట ఇచ్చిన ప్రకారం అమ్మవారి ఆలయ ముఖద్వారాన్ని ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. శ్రీరాములు, బీఆర్ఎస్ నేత జగన్, బింగి శ్రీనివాస్, బస్తీవాసులు జంగయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో పెన్షన్ జమచేయాలి



శేషగిరిరావు, బీజేపీ నేత

మేడిపల్లి: వృద్ధుల పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి పోస్టాఫీస్ కేంద్రాలకు రాలేక పెన్షన్ తీసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు పెన్షన్ డబ్బులను బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, బీజేపీ సీనియర్ నేత శేషగిరిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు సమస్యలు పరిష్కరించాలని వినతి

కీసర: దమ్మాయిగూడ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని మాజీ కీసర గుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు దుర్గం సాయినాథ్‌గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: డివిజన్‌లోని మారుతినగర్ నుంచి భరత్‌నగర్ జంక్షన్ వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డుతో వాహనాలు, బస్సు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రూ.1.15 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ రోడ్డు గుంతలమయం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ మధురిమ, బీఆర్ఎస్ నేతలు అమీనుద్దీన్, భాగ్యానంద్, ఉస్మాన్, వంశీముదిరాజ్, ఆదినారాయణ, మహేష్ స్థానిక నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ హిల్‌టాప్ కాలనీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రూ.3.50 లక్షల సొంత నిధులతో పవర్ బోర్ నీటి స్టోరేజి కోసం నాలుగు వాటర్ ట్యాంకులను నిర్మించారు. సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. హిల్‌టాప్ కాలనీవాసులు గత కొంత కాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఈ ట్యాంకులతో నీటి సమస్య పరిష్కరించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, ప్రేమ్‌కుమార్, అశోక్‌యాదవ్, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఐఎస్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు అనిత, లక్ష్మణ్, కృష్ణ, శ్రీనివాస్, సాయికుమార్, సుభాష్, నాయకులు మేకల రాముయాదవ్, మురుగేష్, అమీనుద్దీన్, వంశీముదిరాజ్, ఉస్మాన్, హేమంత్ పటేల్, సరేష్, అనిల్, సతీష్ పాల్గొన్నారు.

దశల వారీగా మౌలిక వసతులు



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో కొత్త కిశోర్‌గౌడ్

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అన్నారు. చెంగిచర్ల మహాలక్ష్మీనగర్ కాలనీలో రూ.35 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ డివిజన్ పరిధిలో మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, కాలనీ ప్రతినిధులు రాజు, జయశంకర్, దయాకర్‌రెడ్డి, లక్ష్మణ్, సంపత్, సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ నేతలు లోకేష్, అక్బర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు



మంజూరుపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సత్యనగర్ విజయపుర కాలనీలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. సోమవారం కాలనీవాసులకు మంజూరుపత్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. నరేందర్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, సుంకు శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం వేసుకురాలేదని..

- దండించిన ప్రిన్సిపాల్
- స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ధర్నా



అల్వాల్: అంజయ్యనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థి యూనిఫాం వేసుకురాలేదని ప్రిన్సిపాల్ దండించడంతో విద్యార్థి తల్లిదండ్రులు ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అల్వాల్ స్కూల్‌లో శ్రీకృతిక్ అనే విద్యార్థి స్కూల్‌కు యూనిఫాం వేసుకురాలేదు. దీంతో ప్రిన్సిపాల్ చూసి విద్యార్థిని తరగతి బయట నిల్చోబెట్టి దండించాడు. దీంతో విద్యార్థి చేయి, పాదాలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో స్కూల్ యూనిఫాం ఆరకపోవడంతో వేయలేదని, దీనికి విచక్షణారహితంగా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం తండ్రి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న చెరువు గేట్ వాల్వ్‌కు మరమ్మతులు



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని చిన్న చెరువు కట్ట తూము వద్ద గేట్‌వాల్వ్ ఐరన్ షీట్ తుప్పు పట్టడంతో చెరువులోని నీరు లీకై పారుతోందని స్థానికులు సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులకు సమాచారం ఇచ్చి హైడ్రా యంత్రాలతో గేట్ వాల్వ్‌కు మరమ్మతులు చేయించి పునరుద్ధరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్న చెరువు ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా నిండుకుందని, ఈ నేపథ్యంలో హైడ్రా డీఆర్ఎఫ్ టీమ్‌లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న లీకేజీ ఏర్పడినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎడ్యుకేషన్ డీఈ శశ్లజ్, ఏఈ సుధీర్, డీఆర్ఎఫ్ హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సంరక్షణలో బాలుడు

తల్లిదండ్రుల కోసం ఎదురుచూపు



మేడిపల్లి: మేడిపల్లి మండలం పర్వతాపూర్‌లో భరత్(8) తండ్రి చందు ఒంటరిగా తిరుగుతూ.. స్థానికులకు కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోలింగ్‌లో ఉన్న వారు సదరు బాలుడిని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బండ్లగూడ, కీసరకు చెందిన ఈ బాలుడి తల్లిదండ్రులు, బంధువులెవరైనా ఉంటే మేడిపల్లి పోలీసులను సంప్రదించాలన్నారు.

ప్రహరీ నిర్మాణానికి అనుమతించండి



డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: యూత్ అసోసియేషన్ అల్వాల్ పేరుతో ఉన్న భూమికి ప్రహరీ నిర్మించేందుకు అనుమతినివ్వాలని సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 1982లో అప్పటి మంత్రి, రెవెన్యూ అధికారులు పరిశీలించి యూత్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించారని, అట్టి భూమిని ప్రజా వినియోగానికి ఉపయోగపడేలా కంపౌండ్ వాల్ నిర్మించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అశోక్‌కుమార్, సూర్యప్రకాష్, మాధవ్, రవి, లక్ష్మణ్, సురేష్, రవి, శివకుమార్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ఉప్పల్: అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు సోమవారం ఆలయం ఈఓ, అర్చకులు, కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. 4 నెలలకు రూ. 5,03,806 హుండీలో జమ చేసినట్లు గుర్తించారు. ఈవో వెంకన్న, అర్చకులు రవీంద్రశర్మ, కమిటీసభ్యులు దేవిరెడ్డి, లక్ష్మా రెడ్డి, రాఘవేంద్ర, అంజయ్యగుప్తా తదితరులున్నారు.

అధికారి మారినా.. మారని తీరు



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి

మల్కాజిగిరి: సర్కిల్ ఉప కమిషనర్‌గా అధికారి మారినా ప్రజావాణి తీరు మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది. గతంలో ఇక్కడ పనిచేసిన డీసీ బదిలీ తర్వాత వచ్చిన నూతన డీసీ జకియా సుల్తానా ఆధ్వర్యంలో తొలిసారి ప్రజావాణి కార్యక్రమం జరిగింది. అన్ని విభాగాల అధికారులు పాల్గొనాల్సి ఉండగా.. సగం మంది కూడా హాజరు కాలేదు. కేవలం గతంలో ఫిర్యాదు చేయడమే తప్పా.. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పుడైనా ఆ విధానం మారాలని ప్రజలు కోరుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 4 , ఇంజినీరింగ్ విభాగంలో 2, రెవెన్యూ విభాగంలో 1 ఫిర్యాదు వచ్చిందని అధికారులు తెలిపారు.

భోపాల్‌లో శిక్షణకు ఎంపిక



శ్రీనివాస్

మల్కాజిగిరి: నూతన విద్యా విధానంలో భాగంగా అభ్యాసన ప్రక్రియలను ఆసక్తికరంగా మార్చేందుకు ఆగస్టు 4 నుంచి 8వ తేదీ వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగే శిక్షణ కార్యక్రమానికి మల్కాజిగిరిజిల్లా బాలికల పాఠశాలకు చెందిన వృత్తి విద్య ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఎంపికయ్యారు.

మహిళ అదృశ్యం



సంజుదేవి

మేడిపల్లి: ఇంటి నుంచి మెడికల్ షాపునకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీశ్రీనగర్ హుడా పార్కు సమీపంలో నివాసం ఉంటున్న సంజు దేవీయాదవ్(25) ఈనెల 27న మందుల కోసం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో భర్త శంకర్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నరేష్(ఫైల్)

మేడిపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన నరేష్(35) భార్య, పిల్లలతో నివాసం ఉంటూ.. కూలీ పనిచేసుకుంటూ..జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువకావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 6.00 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న సీఈఓ దివ్యాదేవరాజన్

మల్కాజిగిరి: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సెర్ప్ సీఈఓ దివ్యాదేవరాజన్ అన్నారు. సోమవారం మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. 'టీబీ ముక్త్ భారత్'లో భాగంగా స్క్రీనింగ్, ఎక్స్‌రే సేవలు పెంచాలన్నారు. ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలను పెంచాలని, ఓపీ సేవలను కూడా విస్తృతం చేయాలని సూచించారు. ఫీవర్ క్యాంప్స్ పెంచడమే కాకుండా డెంగీ కేసులు పెరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంత మంది రోగుల నుంచి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. డీఎంహెచ్ఓ ఉమాగౌరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సంగీత్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

సమీకృత వ్యర్థాల పార్కు సందర్శన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్‌లోని సమీకృత వ్యర్థాల పార్కు (డంపింగ్‌యార్డు)ను సోమవారం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సందర్శించారు. 100 రోజుల కార్యాచరణ, స్వచ్ఛ్ పీర్జాదిగూడలో భాగంగా స్కూల్ విద్యార్థులు సమీకృత వ్యర్థాల పార్కును సందర్శించి అక్కడ చెత్తను వేరుచేసే విధానాలు, మిషనరీల పనితీరు నిశితంగా పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్వచ్ఛ్ పీర్జాదిగూడకు మేము సైతం అని విద్యార్థులు ముందుకొచ్చి పలు కార్యక్రమాల్లో పాలుపంచుకుని ప్రజల్లోకి స్వచ్ఛ్ పీర్జాదిగూడ నినాదాన్ని తీసుకెళ్లడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, ఏఈ వినీల్‌కుమార్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, బాలమురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీర్జాదిగూడలోని సమీకృత పార్కును సందర్శించిన విద్యార్థులు

ఫలహార బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్: చెంగిచర్లలో బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహంకాళి యూత్ అసోసియేషన్..

చెంగిచర్లలో మహంకాళి యూత్ అసోసియేషన్, ఏర్పుల కల్యాణ్ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, రంగ బ్రహ్మన్నగౌడ్, విక్రంగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

థీమ్‌పార్కులో నాణ్యతా లోపం !





ఊడిపోయిన బాత్‌రూమ్ డోర్, బోరు నీటిని తాగుతున్న చిన్నారులు

ఊడిపోయిన డోరు, టైల్స్

మల్లాపూర్: రూ.3 కోట్లతో 'కలర్స్' థీమ్‌పార్కును మల్లాపూర్‌లో ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇది మూణాళ్ల ముచ్చటగా పార్కులోని వాటర్ ఫౌంటెన్‌కు ఏర్పాటు చేసిన టైల్స్ ఊడిపోతున్నాయి. అంతేకాకుండా పార్కుకు వచ్చేవారికి కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్ డోరు ఊడిపోయి పడిపోయింది. పిల్లలు ఆడుకున్న తర్వాత తాగేందుకు నీరు లేకపోవడంతో బోరునీరు తాగుతున్నారు. థీమ్‌పార్కులో తూతూమంత్రంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మల్లాపూర్ మాజీ కౌన్సిలర్ డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కారమవుతాయనే ఆశ !

కలెక్టరేట్ ప్రజావాణిలో 80 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న కొండంత ఆశతో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలు, బస్తీలు, పురపాలికల నుంచి తరలివచ్చిన మహిళలు, ప్రజలు 80 ఫిర్యాదులను అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో తమ వినతులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి అందజేశారు.

పురపాలికలు నుంచే అధికం

జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్ సర్కిళ్లు ఉండగా.. ఇక్కడ నుంచే అధికంగా 22 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. గతంలో ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులపై సరైన సమీక్షలు లేకపోవడంతో పాటు నిర్లక్ష్యం వంటి కారణాల నేపథ్యంలోనే మూకుమ్మడిగా ప్రజలు దరఖాస్తు చేసుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

- తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబర్లు 286, 332లోని 8 ఎకరాల 4 గుంటల భూమిలో 2017లో వెంచర్ వేయగా.. ఇందులోని రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి ,బోర్‌వేసి చెట్లు పెంచుతున్నారని స్థానికులు, రెడ్డి అసోసియేషన్ ప్రతినిధులు రత్నాకర్‌రెడ్డి, పోలిరెడ్డి, శివకుమార్‌లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రోడ్డులోనే బోరు వేసి, చెట్లను పెంచుతున్న వారిపై చర్యలు తీసుకుని, కబ్జా నుంచి రోడ్డును కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.
- సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులుగా మనపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో దరఖాస్తుదారులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వినతులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రంగా పొందుపరచాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.